క్లుప్తంగా

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: పంటల సాగులో రైతులు చాలావరకు సేంద్రియ ఎరువులను వాడాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు సూచించారు. ఇందులో భాగంగా వారు దత్తత తీసుకున్న మండలంలోని మల్లాపూర్ గ్రామంలో సోమవారం రైతులు సాగు చేస్తున్న పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పత్తితో పాటు కూరగాయాల పంటల్లో కలుపు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వారు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లావణ్య, స్వామి, ప్రమీల, పద్మశ్రీ, పరమేశ్వరీ, నిర్మల, అరుణ, ఏఈఓ నిఖిత, రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కేశంపేట: కార్మికులకు పనికి తగిన వేతనం అందించి వారికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట, మంగళిగూడ గ్రామాల పరిధిలో ఉన్న వేంకటేశ్వర హెచరీస్ అండ్ పౌల్ట్రీఫాంలో పనిచేస్తున్న కార్మికులు వేతనాలు పెంచాలని మూడురోజులుగా సమ్మెను కొనసాగిస్తున్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. యాజమాన్యం స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల సందడి



ఎమ్మార్సీ భవనం వద్ద ఉపాధ్యాయుల సందడి

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి ఉపాధ్యాయులు భారీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీలకు సంబంధించి సోమవారం కొందుర్గు ఎమ్మార్సీ భవనం వద్ద సందడిగా మారింది. కొందుర్గు మండలం నుంచి 33 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా 25 మంది ఇతర ప్రాంతాల నుంచి కొందుర్గుకు బదిలీపై వచ్చినట్లు ఎంఈఓ కిష్టారెడ్డి తెలిపారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ నుంచి 50 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా కేవలం 13 మంది మాత్రమే చౌదరిగూడకు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు బదిలీ అయిన స్థానంలో ఇతర ఉపాధ్యాయులు చేరేవరకు ఉపాధ్యాయులను రిలీవ్ చేయడం లేదని ఎంఈఓ కిష్టారెడ్డి తెలిపారు.

భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ ఎన్నిక


చేవెళ్ల: రైతుల కోసం భారతీయ కిసాన్ సంఘ్ పని చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మల్గారి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా కె. రాజేంద్రప్రసాద్‌గౌడ్, కసిరే మానిక్యం, కార్యదర్శిగా జక్క వీరేశం, సహ కార్యదర్శులుగా ఎర్ర శ్రీకాంత్, దేవేందర్, కోశాధికారిగా ఈశ్వరప్ప, రెవెన్యూ ప్రముఖ్‌గా పాపిరెడ్డి, ఉద్యానవన ప్రముఖ్‌గా లక్ష్మీకాంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ ప్రముఖ్‌గా లక్ష్మణ్‌రావు, పశుపాలన ప్రముఖ్‌గా ఎం.వెంకట్‌రెడ్డి, మహిళా ప్రముఖ్‌గా సునీతారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతినెల రెండో సోమవారం చేవెళ్ల మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద సమావేశం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో రైతు సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాల్సి ఉంటుందన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

శంకర్‌పల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలన కొనసాగిస్తున్నాడని ఏబీవీపీ జిల్లా నాయకుడు హర్ష, శంకర్‌పల్లి పట్టణ అధ్యక్షుడు లోకేశ్ అన్నారు. ఏబీవీపీ సోమవారం ఇచ్చిన పిలుపును విరమించుకున్నా కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రాష్ట్రంలో గ్రూప్‌-1, గ్రూప్‌-2, ఉపాధ్యాయ పోస్టులు, నిరుద్యోగ భృతి వంటి సమస్యల పరిష్కారానికై ఏబీవీపీ ముందుగా సోమవారం సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చింది. అనివార్య కారణాలతో ముట్టడిని ఈనెల 12కి వాయిదా వేయగా.. పోలీసులు మాత్రం కార్యకర్తలను అరెస్టు చేశారు. అనంతరం వదిలేశారు.

అండర్‌పాస్ ‘ఫెయిల్’

- డిజైన్ లోపంతో రూ.16 కోట్లు వృథా
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



అండర్‌పాస్ కింద నీటిలో చిక్కుకున్న ట్రాలీ

కొత్తూరు: ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతతో ఎంతో గజిబిజీగా ఉన్న కూడళ్లలో సైతం ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంజినీర్లు వంతెనలు, అండర్‌పాస్‌లను డిజైన్ చేస్తున్నారు. ఇంజినీర్లు ఇచ్చే సూచనలతో నిర్మించిన వంతెనలు, అండర్‌పాస్‌లు వాహనదారులకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్నాయి. కాగా ఇందుకు భిన్నంగా పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వై జంక్షన్ కూడలీ వద్ద నిర్మించిన అండర్‌పాస్ ప్రమాదాలకు నెలవుగా మారింది. అండర్‌పాస్ డిజైన్‌లో పలు లోపాలు ఉండడంతో ప్రారంభానికి ముందే ఫెయిల్ అయినట్లు వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

కోట్ల రూపాయలు వృథా..

వై జంక్షన్ కూడలీలో తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలను నియంత్రించడానికి గత నాలుగేళ్ల క్రితం ఎన్‌హెచ్ఏఐ అధికారులు అండర్‌పాస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదట్లో రూపొందించిన డిజైన్ ప్రకారం సుమారు 14.68 కోట్లతో అండర్‌పాస్‌ను నిర్మించే పనులకు టెండర్ పిలిచారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించిన తర్వాత స్థానికంగా పలు సమస్యలు తలెత్తడంతో కొన్నాళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. తర్వాత పనులు ప్రారంభించగా వంతెన కింద నుంచి వరద నీరు బయటకు వెళ్లేందుకు తవ్వే మార్గంలో పెద్ద పెద్ద బండరాళ్లు రావడం.. ఆ పనులు కాంట్రాక్టర్‌కు అదనంగా కావడంతో అధికారులు తిరిగి నిధులను పెంచారు. అయినా రాళ్ల కోసం అక్కడ బ్లాస్టింగ్ చేస్తే సమీపంలోని భవనాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉండడంతో తవ్విన కాల్వలను తిరిగి మూసివేశారు. వరద నీటిని ఎత్తిపోసేందుకు రోడ్డుపైనే ఓ సంపును నిర్మించి మోటార్లు ఏర్పాటు చేశారు. కాగా అండర్‌పాస్ పనులు పూర్తిస్థాయిలో కాకపోవడంతో వర్షాలకు కాల్వల ద్వారా పెద్ద ఎత్తున మట్టి కొట్టుకొస్తుంది. దీంతో మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారుల అలసత్వం కారణంగా సుమారు రూ.16కోట్లతో నిర్మించిన అండర్‌పాస్ వినియోగానికి ముందే ఫెయిల్ అయినట్లు వాహనదారులు వాపోతున్నారు.

ప్రమాదాల బారిన వాహనదారులు..

పట్టణంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన అండర్‌పాస్‌తో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరద నీరు 3 నుంచి 4 ఫీట్ల మేర వంతెనకిందకు చేరుతుంది. వరద నీటిని ఎత్తిపోసేందుకు మోటార్లు ఏర్పాటు చేసినా నీరు తగ్గడం లేదు. ఈ క్రమంలో వంతెన కింద నీటి నిల్వలను అంచనా వేయకండా వాహనదారులు వెళ్లడంతో అందులోనే చిక్కుకుంటున్నారు. ఇటీవల కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీశైలం తన కారులో వంతెన కింద నుంచి వస్తూ నీటిలో చిక్కుకున్నాడు. వెంటనే స్థానికులు సాయం చేయడంతో ప్రమాదం తప్పింది. అంతకు ముందు సైతం ఓ కారు నీటిలో నిలిచిపోవడంతో ఇతర వాహనానికి కట్టి బయటకు తీశారు. ఒకవేళ భారీ వర్షం కురిస్తే వంతెన కింద పెద్దఎత్తున నీరు నిలిచే అవకాశం ఉంది. గమనించకుండా వాహనదారులు వస్తే ప్రమాదాలకు గురికావాల్సిందే.



పనులు పూర్తి చేయకపోవడంతో వర్షానికి రోడ్డుపై పేరుకున్న మట్టి

డిజైన్‌లోనే లోపాలు..

వైజంక్షన్ కూడలీలో నిర్మించిన అండర్‌పాస్ డిజైన్‌లోనే లోపాలున్నట్లు స్థానికులు, వాహనదారులు పేర్కొంటున్నారు. వరద నీరు నిల్వకుండా సరైన చర్యలు చేపట్టలేదు. వంతెన కింద నుంచి వాహనాలు వేళ్లేందుకు సరైన ప్రమాణాలు పాటించలేదు. దీంతో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదాలకు నిలయంగా మారింది



అండర్‌పాస్ వంతెన డిజైన్‌లోనే లోపాలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో నిర్మించిన అండర్‌పాస్ ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాకాలంలో వంతెన కింద నిలిచే నీటితో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– ఎర్రోళ్ల జగన్, పెంజర్ల

వంతెన నిర్మాణాలకు కృషి చేస్తా..



పట్టణంలోని వైజంక్షన్, పెంజర్ల, జేపీ దర్గా కూడళ్లలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు అన్ని కూడళ్లలో ప్లైఓవర్లు నిర్మించాలి. ఇప్పటికే కూడళ్లలో జరుగుతున్న ప్రమాదాలను ఎన్‌హెచ్ఏఐ పీడీ నాగేశ్వర్‌రావుతో పాటు ఇతర అధికారులకు నివేదించాం. సాధ్యమైనంత త్వరలో ప్లైఓవర్లు నిర్మించే విధంగా కృషి చేస్తా. వైజంక్షన్ కూడలీలో నిర్మించిన అండర్‌పాస్‌తో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించే విధంగా అధికారులకు సూచిస్తా.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

స్ఫూర్తి ప్రదాత వైఎస్సార్



షాద్‌నగర్ పట్టణ కూడలీలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాద్‌నగర్: సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ముఖ్య కూడలీలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



షాబాద్‌లో..

చిరస్మరణీయుడు వైఎస్సార్

చేవెళ్ల: పేద ప్రజలకు వైఎస్సార్ చేసిన సేవలు మరువలేనివని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన వైఎస్సార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

ఏడీఏ రాజారత్నం

కొందుర్గు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజారత్నం అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించి పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలని, అవసరమైన మందులు పిచికారీ చేయాలన్నారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడితే నేలలోని పోషకాలు నశించిపోతాయని, ఇందుకోసం ఎరువుల మోతాదును తగ్గించాలన్నారు. రైతులు విడిగా పంట మార్పిడి చేయాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడూ తీసివేయాలన్నారు. వర్షాకాలంలో పంటపొలాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

నేనెవరికీ వివరాలు ఇవ్వలేదు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి

షాబాద్: ‘సబ్సిడీ పథకాలకు మంగళం’ శీర్షికతో ఈనెల 8న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంలో తన ప్రమేయం లేకుండా తన ఫొటోతో పాటు అభిప్రాయాన్ని ప్రచురించడాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి ఖండించారు. సబ్సిడీ పథకాలకు ఎలాంటి నిధులు విడుదల కాలేదని, ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన తర్వాత పథకాల గురించి రైతులకు తెలియజేస్తామని తాను చెప్పినట్లు వార్త ప్రచురించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

సొంత నిధులతో రోడ్డు అభివృద్ధి

మాజీ సర్పంచ్‌ను అభినందించిన గ్రామస్తులు

చేవెళ్ల: ప్రజలకు ఇబ్బందిగా మారిన లింకురోడ్డును సొంత నిధులతో బాగు చేయించాడు మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్. మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్ తన సొంత నిధులు రూ.4లక్షలు ఖర్చు చేసి గ్రామ లింకురోడ్డుపై ఉన్న వాగుపై పైపులు వేసి రోడ్డును బాగు చేయించాడు. సోమవారం ఈ పనులను గ్రామస్తులతో కలిసి పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చాడు. దీంతో గ్రామస్తులు శ్రీనివాస్‌ను అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండలంలోని రావులపల్లి గ్రామానికి ఉన్న లింక్‌రోడ్డుతో గ్రామస్తులు మండల కేంద్రానికి చేరుకోవటానికి తక్కువ దూరం అవుతుందని చెప్పారు. ఈ లింక్‌రోడ్డు 7 కిలోమీటర్లు ఉంటే గ్రామానికి ఉన్న మరో ప్రధాన బీటీ రోడ్డు 10 కిలోమీటర్లు దూరం ఉండటంతో పాటు ముడిమ్యాల, కుమ్మెర గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఈ లింకురోడ్డునే ఎక్కువగా రాకపోకలకు ఉపయోగిస్తారన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో వర్షాలు పడితే ఈ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటుందని గుర్తించిన మాజీ సర్పంచ్ తన సొంత నిధులు ఖర్చు చేసి బాగు చేయించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో కలిసి ఈ రోడ్డుపై ఉన్నవాగుపై పైపులు వేసి రాళ్లతో గోడకట్టి వరదలకు కొట్టుకుపోకుండా రోడ్డు వేశాడన్నారు. రోడ్డుపై మట్టి పోయించి వినియోగంలోకి తీసుకురావటం సంతోషంగా ఉందన్నారు. ఈ రోడ్డు బాగు చేయించటంతో గ్రామస్తులు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. పదవీ లేకపోయినా ప్రజల కోసం సొంత నిధులు ఖర్చు చేసి రోడ్డును బాగు చేయించడం అభినందనీయమని కొనియాడారు.



లింకురోడ్డులో ఉన్న వాగుపై నిర్మించిన వంతెన, పైన రోడ్డు

రిటైర్మెంట్ జీఓను జారీ చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి

షాద్‌నగర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పదవీ విరమణకు సంబంధించిన రిటైర్మెంట్ జీఓను ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు సీడీపీఓ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను అత్యవసరంగా విధుల నుంచి వెళ్లాలని హుకూం జారీ చేయడం సరికాదన్నారు. వారి పదవీ విరమణకు సంబంధించిన జీఓను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు వారిని విధుల్లో కొనసాగించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఐసీడీఎస్‌కు ఎన్నో సేవలు అందించారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇలాంటి వారికి ప్రభుత్వం బెనిఫిట్స్ ఇవ్వకుండా వెళ్లిపోమని చెప్పడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం బెనిఫిట్స్ కింద అంగన్‌వాడీ టీచర్‌కు రూ.5లక్షలు, ఆయాలకు రూ.3లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఇస్తున్న వేతనంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, యామిని, నాగమణి, లలితమ్మ తదితరులు ఉన్నారు.



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

చేవెళ్ల: ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ సాయిరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. మండల కేంద్రంలో సీపీఐ కాలనీ ఫేజ్‌-2గా ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 75లో గత 16నెలలుగా ఇళ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని చెప్పారు. ఇక్కడ పేదలకు నీళ్లు, కరెంట్ కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. ప్రభుత్వం ఇళ్లు లేని పేదలను గుర్తించి వెంటనే వారికి ఇళ్ల పట్టాలు అందించాలని కోరారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని సీపీఐ నాయకులతో కలిసి పేదలు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం చేవెళ్ల ఆర్డీఓ సాయిరాంకు వినతిపత్రం అందజేశారు. ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జే.అంజయ్య, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల కార్యదర్శులు శ్రీనివాస్, సుధీర్, చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎండీ.మక్బూల్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఇటీవల పదవీ కాలం ముగిసిన బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులకు పట్టణంలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో సన్మానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని విమర్శించారు. ప్రజా సమస్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలని సూచించారు. కేసీఆర్ పాలనలో పట్టణాలు, పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని నాయకులందరూ ముందుకు సాగి నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొందూటి నరేందర్, ఈట గణేశ్, వంకాయల నారాయణరెడ్డి, రాజావరప్రసాద్, ఎమ్మె సత్యనారాయణ, శ్రీలత, లక్ష్మణ్‌నాయక్, మిట్టునాయక్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



కేశంపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీజేవైఎం స్వచ్ఛ్ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. రైతులకు రైతు భరోసా, పంట బీమా, కౌలు రైతులకు సంవత్సరానికి రూ.15వేలు ఆర్థికసాయం వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోర్చా మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ అజీంఅలీకి వినతిపత్రం అందించారు. హామీలను అమలు చేయకుంటే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పించిన పూర్వ గురువులను ఘనంగా సన్మానించారు. వారందరూ ఒకచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.